## కార్తీక మాసం..



## హరహర మహాదేవ
# శంభో శంకర

## మూడో సోమవారం



నల్లకుంట:కార్తీకమాసం మూడో సోమవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. వేకువజాము నుంచి భక్తులు ఆది దంపతుల దర్శనం కోసం ఆలయాలకు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయాల్లో శివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

**పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి తేనెతో అభిషేకం..**

న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయం(న్యూరామాలయం)లో పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామికి ఉదయం అర్చక స్వామి జ్ఞానేశ్వర్ మంత్రోచ్చరణల నడుమ తేనెతో అభిషేకం కావించారు.అనంతరం శివయ్యను పుష్పాలతో అలంకరించి,మారేడు దళములతో విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా మహిళలు ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున దీపాలు వెలిగించి ముక్కంటి మొక్కులు తీర్చుకున్నారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు దివంగత మంగళపల్లి బాలమురళీకృష్ణ ప్రియ శిష్యుడు, ఆలిండియా రేడియో కళాకారుడు డీవీ. మోహన కృష్ణ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇష్టదైవాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు.

**శంకరమఠంలో..**

నల్లకుంట శంకరమఠంలో ఉదయం శక్తి గణపతికి ఆది పూజలు నిర్వహించారు. అనంతరం చంద్రమౌళీశ్వర స్వామి(శివుడు) ప్రత్యేక అభిషేకాలు అర్చనలు చేశారు. అలాగే శారదాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆది దంపతుల దర్శనం కోసం వచ్చిన భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

శివం రోడ్డులోని లింగాలగడ్డ శివాలయం, తిలక్‌నగర్‌లోని పెద్ద శివాలయంలో శివుడికి ఉదయం ప్రత్యేక అభిషేకాలతో పూజలు కావించి హారతులు ఇచ్చారు.

## హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి



పూజలో ఎస్‌ఆర్‌ లక్ష్మణ్‌రావు

కాచిగూడ: హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బజరంగ్‌ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఆర్‌ లక్ష్మణ్‌రావు అన్నారు. సోమవారం కాచిగూడ వీరన్నగుట్టలోని హనుమాన్‌ దేవాలయంలో బజరంగ్‌ సేన కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మన దేశ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవడానికి యువత ముందుకు రావాలని కోరారు.

## కమనీయం శివపార్వతుల కల్యాణం

కవాడిగూడ: దోమలగూడ అడ్వకేట్స్‌ కాలనీలోని బాలత్రిపురసుందరి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్‌, మాజీ కార్పొరేటర్‌ టి.రవిందర్‌ ఆధ్వర్యంలో సోమవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సోమవారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్‌ రవీందర్‌ మాట్లాడుతూ... ఆధ్యాత్మిక చింతన తోటి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్తీకమాసంలో ప్రతి ఏటా బాలత్రిపురసుందరీ దేవి ఆలయంలో శివపార్వతుల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.వెంకటేష్‌, తాళ్లబస్తీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్‌ శ్రీనివాస్‌ ముదిరాజ్‌, శివరాజ్‌, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకర్‌ గంగపుత్ర, శ్రీనివాస్‌, ప్రేమ్‌కుమార్‌, బీజేపీ నేతలు కేశవ రాజు, అనిల్‌, సూర్యనారాయణ, రమేష్‌గౌడ్‌ తదితరులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణంలో పాల్గొన్నారు.

**దేవునితోటలో ఆకాశ దీపోత్సవం**

ముషీరాబాద్‌: భోలక్‌పూర్‌ డివిజన్‌ దేవునితోటలోని ప్రసిద్ధిగాంచిన భవానీ శంకర దేవాలయంలో సోమవారం ఆకాశ దీపోత్సవ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో జ్యోతి, సిబ్బంది సురేష్‌కుమార్‌, సాగర్‌ తదితరులు పాల్గొన్నారు.



శివపార్వతుల కల్యాణంలో మాజీ కార్పొరేటర్‌ రవీదర్‌, వెంకటేష్‌ తదితరులు



కల్యాణం అనంతరం అన్నదానం కార్యక్రమం

## అంగన్వాడీ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

కాచిగూడ: అంగన్వాడీ కేంద్రాల్లో మరిన్ని మెరుగైన వసతులు కల్పించాలని కాచిగూడ కార్పొరేటర్‌ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌ అధికారులకు సూచించారు. సోమవారం కాచిగూడ డివిజన్‌ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్‌తో సమావేశమై వారి సమస్యలను, పిల్లలకు అందిస్తున్న వసతులు, సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూర్‌వైజర్‌ కవిత, టీచర్లు లావణ్య, తారా, శాంతాబాయి, సారిక తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం
## రాష్ట్ర సంయక్త కార్యదర్శిగా నర్సింగ్‌ రావు



నల్లకుంట: తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన శంకర్‌గారి నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్‌ అయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగ్‌ రావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. పద్మశాలీలు విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాలతో పాటు రాజకీయాల్లో రాణించేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

**జలమండలి అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం**

ముషీరాబాద్‌: రాంనగర్‌ డివిజన్‌ బాకారం వెస్లీ చర్చి ప్రాంతంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ జలమండలి అధికారులను ఆదేశించారు. సోమవారం జలమండలి అధికారులతో కలిసి వెస్లీ చర్చి ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు, స్థానికులు డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే నూతన పైపులైన్‌ వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదిక నిధులు కేటాయించి పనులు చేపడతామని తెలిపారు. డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు శంకర్‌ముదిరాజ్‌, ప్రభాకర్‌, మురళీ, నవీన్‌, అరుణ్‌, వెంకటేష్‌, వెస్లీ చర్చి కమిటీ సభ్యులు బీజే థామ్సన్‌, జయారావు, సునీల్‌, ఎస్‌కే సైమన్‌, కరుణానందం, మైకేల్‌ ప్రసన్న, విజయ్‌కుమార్‌, కె.జోసఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై దాడులు, హింస పెరుగుతున్నాయి

**శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్‌ ప్రేంపావని**




నారాయణగూడలో మాట్లాడుతున్న శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్‌ ప్రేంపావని

కాచిగూడ: మహిళలపై పెరుగుతున్న దాడులు, హింసను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్‌ ప్రేంపావని అన్నారు. సోమవారం నారాయణగూడలో భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్‌ సమావేశాల సందర్భంగా ఏర్పాటు చేసిన కౌటౌట్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ నెల 23, 24వ తేదీల్లో నగరంలో జరిగే మహిళా సమాఖ్య నిర్మాణ కౌన్సిల్‌ సమావేశాలను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

– మహిళ రిజర్వేషన్ల కోసం తీసుకొచ్చిన చట్టంలో అనేక షరతులు ఉన్నాయని అన్నారు. వాటిని తొలగించి రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయటానికి కావాల్సిన విధానపరమైన నిర్ణయాలు కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలన్నారు. మహిళలపై హింసను ప్రేరేపించే సినిమాల విషయంలో రెండవ శ్రేణి పౌరులుగా గుర్తించే సినిమాలపై సెన్సార్‌ విధించాలన్నారు. మహిళల భద్రత, ఆరోగ్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షురాలు పడాల నళిని, సక్రిబాయి, వాణి, పద్మ, శ్యామల, హారతి, కమలమ్మ, అంజుమ్‌, జ్యోతి, సారా, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలి

**గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రియాజ్‌**



సుందరయ్యవిజ్ఞానకేంద్రం వద్ద పిల్లల పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న డాక్టర్‌ రియాజ్‌

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థులు పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలని అది జ్ఞానానికి మరో నిదర్శనమని తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ డాక్టర్‌ రియాజ్‌ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లల పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రియజ్‌ మాట్లాడుతూ... గ్రంథాలయం ఒక దేవాలయం లాంటిదని అన్నారు. ప్రతి ఒక్క పుస్తకం అపారమైన జ్ఞానానికి నిదర్శనంగా ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. పుస్తకం మంచి స్నేహితుడివలే అండగా ఉంటుందని అన్నారు. నేటి యువత సెల్‌ఫోన్‌ వాడకంపై మక్కువ పెంచుకోని చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారని అన్నారు. ఇలాంటి చర్యల వల్ల పుస్తకం విలువలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రులు పుస్తక పఠనంపై మక్కువ పెంచుకునే విధంగా పిల్లల్లో అవగహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ బుక్‌ హౌస్‌ జనరల్‌ మేనేజర్‌ వాసు, ఎస్‌వీకే కమిటీ సభ్యులు బుచ్చిరెడ్డి, ఎండీ అబ్బాస్‌, కోట రమేష్‌, శోభన్‌నాయక్‌, టి. స్కైలాబ్‌బాబు, కృష్ణారెడ్డి, సుభాషిణి, ధనలక్ష్మి, రాఘు తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ బెంగాల్‌కు చెందిన కూలీ ఆత్మహత్య

కాచిగూడ: బతుకుదెరువు కోసం కూలీపని చేయడానికి నగరానికి వచ్చిన పశ్చిమ బెంగాల్‌ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్సై రవికుమర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాళ్‌కు చెందిన డి.సంతాల్‌ (38) కూలీపని కోసం నెలరోజుల క్రితం నగరానికి వచ్చాడు. కాచిగూడ పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తూ కూలీ పని చేసుకుంటున్నాడు. కాచిగూడలోని ఖాజా గరీబ్‌నగర్‌ ప్రాంతంలో ఇనుప రాడుకు పాత చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'నిజాయితీ, సేవాభావం ఉన్నతస్థాయిలో నిలుపుతాయి'



బండారు సుబ్బారావు దంపతులకు ఆదర్శ దంపతుల పురస్కారం అందజేస్తున్న కోలేటి దామోదర్‌

చిక్కడపల్లి: మనలో నిజాయితీ, సేవాభావం ఉంటే ఉన్నతస్థాయిలో నిలుపుతాయని పోలీస్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌ పూర్వచైర్మన్‌ కోలేటి దామోదర్‌ అన్నారు. బండారు సుబ్బారావు వ్యాపార రంగంలో నిజాయితీగా ఉంటూ సేవా కార్యక్రమాల్లో నిరంతరం ఆపన్నులకు సహాయం అందిస్తున్నారని అన్నారు. సోమవారం సాయంత్రం సీల్‌వెల్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ బండారు సుబ్బారావు జన్మదిన వేడుకలు చిక్కడపల్లిలోని కార్యాలయంలో అభినందన సమావేశం శ్రుతిలయ ఆర్ట్స్‌ అకాడమీ నిర్వహణలో జరిగింది. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి ఆమని మాట్లాడుతూ.. ఎందరో కళాకారులను ప్రోత్సహిస్తూ తమ సంస్థకు వెన్నుదన్నుగా సుబ్బారావు నిలిచారన్నారు. ఆయన కళా హృదయుడు సేవా తత్పరత గల వారిని కొనియాడారు. ఈ సందర్భంగా బండారు సుబ్బారావు దంపతులను సత్కరించి ఆదర్శదంపతుల పురస్కారం అందజేశారు.

## కొత్త వక్ఫ్‌ బిల్లుకు జమాతే ఇస్లామిక్‌ హింద్‌ వ్యతిరేకం

కాచిగూడ: కొత్త వక్ఫ్‌ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తుందని జమాతే ఇస్లామీ హింద్‌ తన వైఖరిని జాయింట్‌ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ముందు పూర్తి స్పష్టతతో నివేదికన సమర్పించిందని జమాతే ఇస్లామీ హింద్‌ అధ్యక్షుడు సయ్యద్‌ సాదతుల్లా హుస్సైనీ తెలిపారు. బషీర్‌బాగ్‌ ప్రెస్‌ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంస్థ వైస్‌ ప్రెసిడెంట్‌ మలిక్‌ మోతాసీమ్‌ ఖాన్‌, ప్రొఫెసర్‌ సలీంలతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈ నెల 15,16,17 తేదీల్లో నగరంలో జరిగిన సమాతే ఇస్లామిక్‌ హింద్‌ అఖిల భారత సభ్యుల సమ్మేళనంలో ఆమోదించిన తీర్మానాలను ఆయన వెల్లడించారు. మతోన్మాద శక్తుల ద్వారా కొనసాగుతున్న విధ్వంసకర వ్యూహాలు మన దేశంలోని ముస్లింలకు మరింత సవాల్‌గా మారే పరిస్థితులను కలిగి ఉన్నాయని ఆరోపించారు. మతపరమైన సంస్థలు, ప్రార్థన స్థలాలు, ఆస్తులను లక్ష్యగా చేసుకుని జరుగుతున్న దాడులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నామన్నారు. బుల్డోజింగ్‌కు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ప్రభుత్వాలు కూల్చివేతలను కొనసాగిస్తున్నాయని వారు పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో శాంతి, న్యాయ స్థాపన ఏర్పాటుకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## కలుషిత నీటి సరఫరాను అరికట్టండి

చిక్కడపల్లి: కొన్ని రోజులుగా కొనసాగుతున్న కలుషిత నీటి సరఫరాపై కార్పొరేటర్‌ పావని ఆగ్రహం వ్యక్తం చేశారు.గాంధీనగర్‌ డివిజన్‌లోని సబ్మతినగర్‌లో స్థానికుల ఫిర్యాదు మేరకు ఆమె సోమవారం ఆమె పర్యటించారు. సమస్యను తెలుసుకుని వెంటనే వాటర్‌వర్క్స్‌ అధికాలతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. సత్వరమే ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వినయ్‌కుమార్‌, శ్రీకాంత్‌, ఉమేష్‌, ఆకుల సురేందర్‌, సురేష్‌, సాయికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... డీకే పురానికి చెందిన అజీజ్‌ భార్య చాందిని (70) బుద్వేల్‌–ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గొర్రెలు, మేకల పెంపకందారుల
# సమస్యలు పరిష్కరించాలి



గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఉడుత రవీందర్‌

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకం దారుల సమస్యలను పరిష్కరించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్‌ డిమాండ్‌ చేశారు. గొర్రెల పెంపకం దారుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. సోమవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో జరిగిన సమావేశంలో ఉడుత రవీందర్‌ మాట్లాడుతూ... గొర్రెల పెంపకం వృత్తిపై లక్షలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. రోజు రోజుకు వృత్తిలో ఇబ్బందులు పెరుగుతున్నందున్న ప్రభుత్వం గుర్తించి వాటిని పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన రెండో విడత గొర్రెల పంపిణీ వాగ్దానాన్ని విస్మరించిందని అన్నారు.

◆ అవినీతి సాకుతో ఏడాది పాటు కాలయాపన చేసి మూడేళ్ల క్రితం కట్టిన 80వేల మంది డీడీల డబ్బులు తిరిగి ఇవ్వడం బాధాకరమని అన్నారు. దీంతో గొల్ల కురుమలు తీవ్రంగా నష్టపోయారని వాపోయారు.గొర్లకాపరులపై భౌతిక దాడులు జరుగుతున్నాయని ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలలో వందలాది గొర్రెలు చనిపోతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందడంలేదని అన్నారు.

◆ పశు వైద్యశాలల్లో మందులు లేవని డాక్టర్లే చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గొర్లకాపరులకు రైతు బీమా వర్తిస్తుందనే పేరుతో ఎక్స్‌గ్రేషియా చెల్లించడం లేదన్నారు. గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కిల్లే గోపాల్‌, ప్రొ. బీనవేణి రామయ్య, మారం తిరుపతియాదవ్‌, టి.రంగన్న, గంటి చంద్రుడు, గొరిగే నర్సింహ, గంగుల మధుయాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవం



కార్యక్రమంలో మాజీ ఎంపీ వీహెచ్‌, నిర్వాహకులు, కార్పొరేటర్‌ బి.పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: అంబర్‌పేట మహంకాళి ఆలయ బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన వేడుకుల వైభవంగా జరిగాయి. అంబర్‌పేట ప్రధాన రోడ్డులో పునఃప్రతిష్ఠించనున్న బొడ్రాయి ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ వేడుకలకు మాజీ ఎంపీ వి.హనుమంతరావు, కార్పొరేటర్‌ పద్మావెంకట్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజాలు చేశారు. అంతకుమందు గోపూజ, గణపతి పూజ, దీక్షధరణి, యాగశాల తదితర పూజలు నిర్వహించారు.



నిర్వాహకులు దుర్గప్రసాద్‌రెడ్డి, పి.జ్ఞానేశ్వర్‌గౌడ్‌, గడ్డం లక్ష్మణ్‌గౌడ్‌, వై.శంకర్‌గౌడ్‌ రంగంపల్లి రాజు, మల్లికార్జున్‌గౌడ్‌, చింతాల శ్రీనివాస్‌ ముదిరాజ్‌, గిరిధర్‌ గౌడ్‌ తదితరులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## చిరు ధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

**పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్‌ ఖాదర్‌ వలి**

కాచిగూడ: చిరుధాన్యాలు శరీరానికి అవసరమైన పోషకాలన్నీ అందిస్తాయని, అదే సమయంలో చిన్నచిన్న అనారోగ్యాలు మొదలు, కేన్సర్‌, కొన్నిరకాల గుండెజబ్బుల్లాంటివి రాకుండా కాపడటంలో కీలకపాత్ర పోషిస్తాయని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్‌ ఖాదర్‌ వలి అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని అక్స్‌ఫర్డ్‌ గ్రామర్‌ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్‌ ఖాదర్‌ వలీ పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ చిరుధాన్యాలవైపు మన ఆహార దృష్టిని మార్చవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. చిరుధాన్యాల్ని ఒకేసారి కాకుండా నెమ్మదిగా జీవన విధానంలో చేర్చుకోవాలని, రోజువారీ తీసుకునే ఆహారంలో అరవై శాతం వరకూ చిరుధాన్యాలతో చేసిన పదార్థాలుండేలా చూసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆక్స్‌ఫర్డ్‌ పాఠశాల విద్యార్థులలో స్థిరమైన, ఆరోగ్యకరమైన ఆహార ఎంపికల పట్ల లోతైన అవగాహన కలిగించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 'ఖాదర్‌ వలి సిరి జీవన విధానం కళాత్మకం' అనే పేరుతో లయన్స్‌ క్లబ్‌ ప్రతినిధి ఎస్‌. ధనంజయ్య ప్రచురించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు.

## అంబేడ్కర్‌ వర్సిటీలో 27న వంటావార్పు

బంజారాహిల్స్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలం జవహర్‌లాల్‌ నెహ్రూ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ విశ్వ విద్యాలయానికి కేటాయించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఉద్యోగులు డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) చైర్‌పర్సన్‌ ప్రొఫెసర్‌ పల్లవీ కాబ్డే, కన్వీనర్‌ వడ్డాణం శ్రీనివాస్‌, సెక్రటరీ జనరల్‌ వేణుగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ ఈ నెల 27న విశ్వవిద్యాలయంలో వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నేతలు డాక్టర్‌ రజని, కృష్ణారెడ్డి, యాకేష్‌ దైద ఉన్నారు. మరోవైపు విశ్వవిద్యాలయంలో గత 60 రోజులుగా కొనసాగుతున్న మధ్యాహ్న భోజన విరామ సమయంలో జరిగిన నిరసనలో జేఏసీ నేతలు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# చెట్ల కొమ్మలు తొలగించరా..?



టీఆర్టీ కాలనీ, ప్రశాంత్‌నగర్‌లో వీధి పక్కన వదిలేసిన చెట్ల కొమ్మలు

నల్లకుంట: నల్లకుంట డివిజన్‌ పరిధిలోని టీఆర్టీ కాలనీ, ప్రశాంత్‌ నగర్‌ వీధుల్లో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు విద్యుత్‌ సరఫరాకు ఆటంకం కలిగించాయి. సమస్యను గుర్తించిన విద్యుత్‌ శాఖ అధికారులు పది రోజుల క్రితం వీధుల్లో ఏపుగా పెరిన చెట్ల కొమ్మలకు ట్రిమ్మింగ్‌ చేయించారు. కాగా నరికి వేసిన కొమ్మలను అక్కడి నుంచి తొలగించకుండా నిర్లక్ష్యంగా అక్కడే వీధుల్లో కుప్పలుగా వేయించి చేతులు దులుపుకున్నారు. వ్యర్థాలను తొలగించాలని పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బందికి పలు మార్లు విజ్ఞప్తి చేసినా తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. చెట్ల కొమ్మలు వీధుల్లో కుప్పలుగా పోసి వదిలి వేయడం కారణంగా దోమలు వృద్ధి చెంది కంటి మీద కునుకు లేకుండా చేయడంతో పాటు వ్యాధులు వ్యాపింప చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అదే విధంగా ఈ చెట్ల కొమ్మలను వేసిన చోట కొందరు అపార్ట్‌మెంట్లు, తమ ఇళ్లల్లోంచి తీసుకు వస్తున్న వ్యర్థాలను అక్కడే పడవేసి వెళుతున్నారని, దీంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు అంటున్నారు. ఈ చెట్ల కొమ్మల కుప్పలు, పేరుకు పోతున్న వ్యర్థాల కారణంగా తీవ్రమైన దుర్గంధం వెలువడుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించి వీధుల్లో పేరుకుపోయిన చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.







# విద్యుత్‌ సిబ్బంది నిర్లక్ష్యం

**రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న స్థానికులు**



బాగ్‌లింగంపల్లిలోని సాయిబాబా టెంపుల్‌ ప్రధాన రోడ్డులో పడివేసిన చెట్టుకొమ్మలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: గత వారం రోజుల క్రితం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కు, సాయిబాబా టెంపుల్‌ తదితర ప్రాంతాలలో విద్యుత్‌ మరమత్తుల నిమిత్తం పలుప్రాంతాలలో చెట్ల కొమ్మలను నరికివేసి ఎక్కడికక్కడే వదిలేసిపోయారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపుల కుప్పలు తెప్పలుగా చెట్ల కొమ్మలను నరికేసి నిర్లక్ష్యంగా వదిలివేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లకొమ్మలు నరికివేసి వారం రోజులు గడుస్తున్నా వాటిని తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా స్పందించకుడా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కరెంటు తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను నరికివేసిన ట్రాన్స్‌కో సిబ్బంది వీటిని తొలగించకుండా రోడ్డుపైనే వేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని వారు కోరుతున్నారు.